క్లుప్తంగా

వడ్డేశ్వరం హాస్టల్స్‌లో విస్తృత తనిఖీలు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ చుట్టు పక్కల ఉన్న పలు హాస్టళ్లను శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వడ్డేశ్వరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులు, యువతీ యువకుల గదులను తనిఖీ చేస్తున్నామన్నారు. విద్యార్థుల ముసుగులో ఉన్న అసాంఘిక శక్తులను నివారించేందుకు ఈ తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఇప్పటి వరకు తాడేపల్లి సీఐలు కల్యాణ్ రాజు, ఎస్సై నజీర్, మరో వందమంది సిబ్బందితో 20కు పైగా హాస్టళ్లను తనిఖీ చేశామని, అనుమానించదగ్గ వారు ఎవరూ కనిపించలేదని పేర్కొన్నారు. పూర్తిగా అన్ని హాస్టళ్లను తనిఖీ చేయనున్నట్లు రవికుమార్ తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి



తాడేపల్లిరూరల్ : రామచంద్రాపురంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం సుబ్రహ్మణ్య స్వామికి పంచామృత, ఫల అభిషేకం, కుంకుమ, గంధం, విభూతితో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత నామాలతో స్వామివారికి ఘనంగా పూజాదికాలు గావించి, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమిరెడ్డి అంజిరెడ్డి, కుర్రె సుధాకర్ రెడ్డి, సునంద దంపతులు పాల్గొన్నారు.

సామగ్రి వితరణ



తాడేపల్లిరూరల్: ఉండవల్లి గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.50 వేల విలువ చేసే స్టేషనరీ, ఫ్యాన్‌లను శనివారం వితరణ ఇచ్చారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ సామగ్రి అందజేసిన అమ్మ ఫౌండేషన్ అధినేత జొన్న శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గాదె వినయ్ కుమార్, కొప్పోలు ప్రదీప్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మంగళగిరి: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాలో సవరణ ఉంటే తహసీల్దార్ కార్యాలయాలలో సరి చూసుకుని, తప్పులుంటే సరి చేసుకోవాలని పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా విడుదల

తాడేపల్లిరూరల్ : గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు వచ్చిన జాబితాను పరిశీలించి పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి జాబితాను ఎంటీఎంసీ కార్యాలయంలో పరిశీలన కోసం ఉంచామని, ఆ ఓటర్ల లిస్టును పరిశీలించుకుని ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నా, మార్పులు చేర్పులు ఉన్నా వెంటనే తెలియజేయాలన్నారు. దరఖాస్తులను సోమవారం వరకు స్వీకరించబడతాయన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆర్ ఎస్ ఫౌండేషన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 12,13 వార్డులలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు 50 మందికి శనివారం చినరావూరులో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ పల్లె శ్యామూల్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఝాన్సీరాణి, రోహి, ప్రభాకర్, సలోమి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు లేదు.. పింఛనూ రాదు

- నిలిచిన నూతన రేషన్ కార్డు, పింఛన్లు
- కూటమి ప్రభుత్వంలో మంజూరుపై స్పష్టత కరువు
- మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు
- కొత్తవి ఇస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం



రేషన్ కార్డులు

తాడేపల్లిరూరల్: కొత్తగా రేషన్ కార్డులు, నూతన పింఛన్లకు ఈ నెల 2వ తేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సోషల్ మీడియాలో గత పది రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు మార్గదర్శకాలేవీ తమకు రాలేదని జిల్లా అధికారులు చెప్తున్నారు. ప్రధానంగా సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఉత్తర్వులు లేవని స్పష్టం చేస్తున్నారు. కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని వెల్లడిస్తున్నారు. 2023 డిసెంబర్ తర్వాత కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయలేదు.

గతేడాది దరఖాస్తు చేసుకున్న వారు...

రేషన్ కార్డులకు గతేడాది డిసెంబర్ వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అర్హత కలిగిన వారికి నంబర్లు కూడా కేటాయించారు. కానీ, అనంతరం ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 4వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపరిచినా ఇంత వరకు మోక్షం లేదు. ఈ ఏడాది కాలంలో వివాహం చేసుకున్న వారు, ఒంటరి మహిళలు, ఇతర తరగతుల వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేక ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం కార్డులో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేదు. కార్డులోని కుటుంబ సభ్యులు మరణిస్తే వారి పేరున కార్డు ఉంటే వారు ఈకేవైసీ చేస్తే కానీ ఇతర సదుపాయాలు అందడం లేదు. రేషన్ కార్డు తదుపరి కుటుంబ పెద్ద పేరున మార్చడానికి కూడా ఇంత వరకు తగిన మార్గదర్శకాలు రాలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 50 ఏళ్లు దాటిని వారికి కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాకపోవడంతో వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు.

అలాంటిదేమీ లేదు..

రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరుపై తహసీల్దారు సీతారామయ్య స్పందిస్తూ.. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు. తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో ఆయా సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు, ఇతర సామాజిక పెన్షన్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వెబ్ సైట్ విడుదల కాగానే అర్హులకు రేషన్ కార్డులు, సామాజిక పెన్షన్లు కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

తెనాలిఅర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పటల్స్ పలమనాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా ఫార్మసీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలికాలంలో దగ్గు, జలుబు, పెద్దవారిలో ఆస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నియంత్రించవచ్చని చెప్పారు. సమావేశంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ ముక్తార్ అహ్మద్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ, శ్రీ పాట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజర్ శ్రీనివాసరావు, డాక్టర్ షారోన్ లిల్లీ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ దుర్గారావు, వల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు రూరల్: నగర శివారు 41వ డివిజన్‌లోని అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహాల సమీపంలో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. భవనం మొదటి ఫ్లోర్‌లో నిర్మాణం పూర్తయిన భోజనశాల, కాన్ఫరెన్స్ హాల్, ఆఫీసు రూమ్, కారిడార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు అధికారులు భవన నిర్మాణ పురోగతిపై వివరిస్తూ రెండు ఎకరాల స్థలం క్రిస్టియన్ భవన్‌కు కేటాయించడం జరిగిందని, దీనిలో 0.9 ఎకరాల్లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో మొదటి ఫేజ్ నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సెల్లార్, మొదటి అంతస్తులో భోజనల పూర్తయ్యాయని వివరించారు. ప్రహరీ నిర్మాణం, ఆవరణలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, రెండవ అంతస్తులో ప్రధాన సమావేశ మందిరాన్ని నిర్మించాల్సి ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చేపట్టాల్సిన నిర్మాణ పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మాబూషరీఫ్, డీఈ భాను ప్రకాష్, క్రిస్టియన్ మైనారిటీ సమన్వయకర్త పాస్టర్ ఎన్నయ్య, పాస్టర్లు ఏలీషా, ప్రకాష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్ష



శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు బకాయిల కోసం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు ఎస్కే మున్ని దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ ఎస్‌కె సలీమ్, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు సామేల్ మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని, అవసరమైతే పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిలను రప్పిస్తామన్నారు. సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులు తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇదే పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. దీక్షలో వై. రమాదేవి, టి. దుర్గాభవాని, శారమ్మ, రమణ, కె.సీత పాల్గొన్నారు. కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, ఎం.గురవయ్య, ఎం.శారద, యెహోషువ, బాష, సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు ఆర్. పూర్ణచంద్రరావు, బి. సుభాని, బిఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



బాల భవన్ సిబ్బందితో శ్రీరామచంద్రమూర్తి

తాడేపల్లిరూరల్ : అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిగురు బాలల గ్రామంలో నవజీవన్ బాలభవన్ సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులు వ్యాపార సమూహాలు, ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకోవచ్చని వివరించారు. సైబర్ బెదిరింపు, సైబర్ స్టాకింగ్, సాఫ్ట్‌వేర్ పైరసీ, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ డ్రగ్ ట్రాఫికింగ్, మనీ లాండరింగ్, సైబర్ దోపిడీ వంటివి ఉన్నాయని వివరించారు. సైబర్ క్రైమ్స్‌లో 108 రకాల మోసాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తి దురుద్దేశ పూర్వంగా డబ్బు సంపాదనకు.. ఎలక్ట్రానిక్ డివైస్ ఉపయోగించి మోసం చేస్తే దానిని సైబర్ క్రైమ్‌గా మనం భావించాలన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందివ్వాలని సూచించారు. బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్, డైరెక్టర్ ఫాదర్ మిల్కియర్, హెచ్ఆర్ ఆఫీసర్ జోసెఫ్ డోనాల్డ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల వెతలపై కేంద్ర సహాయ మంత్రికి వినతి

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం అమలును నిలిపివేయాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది యువత ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగ అవకాశాలు లేక ఆటోలు, ట్రాలీ ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే, మనిషి మరణిస్తే వాహనం నడిపే డ్రైవర్లు వాహనం నిర్లక్ష్యంగా నడిపారని, పారిపోయాడనే సాకుతో పది సంవత్సరాల జైలు శిక్ష, 10 లక్షల జరిమానా విధించే విధంగా భారతీయ సంహిత 2023 చట్టం తీసుకు రావడం వల్ల మోటారు వాహనాల డ్రైవర్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వివరిస్తూ వినతి పత్రం అందజేశామని తెలిపారు. లక్షలాది మంది డ్రైవర్ల ఉపాధి కోల్పోయే ఈ చట్టం అమలును నిలిపివేయాలని పార్లమెంట్‌లో చర్చించాలని కోరామని అన్నారు. స్పందించిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్‌లో సమస్యను విన్నవిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారావు, నవీన్, ఎస్‌కె సత్తార్, వై. కొండలు, హనుమంతరావు, ఎస్‌కె. కాసిం తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం కలిగి ఉండి విద్యార్థుల ఎదుగుదలకు సహకారాలు అందించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని మౌలిక వసతులు పరిశీలించి, పాఠశాలలోని మధ్యాహ్న భోజనం కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటి వద్ద చదువుతున్నారా లేదా , పాఠశాలలో ఏవిధంగా నడుచుకుంటున్నారు అన్న అంశాలను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. పలు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మి,ఎస్ఐ పి.కోటేశ్వరరావు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు డాక్టర్ అరుణకు సత్కారం

తెనాలి: పట్టణ అయితానగర్‌కు చెందిన అధ్యాపకురాలు వట్టిప్రోలు అరుణకుమారికి అంతర్జాతీయ గురుగౌరవం లభించింది. దుబాయ్ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దుబాయ్‌లోని కాప్రాన్ స్టార్ హోటల్ ఆడిటోరియంలో 'స్పందన వెల్నెస్ వేవ్స్' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇదా ఫౌండేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఇదా శామ్యూల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఆస్కా చైర్మన్ / మోటివేటర్ డాక్టర్ బాలచందర్ సాదే అతిథిగా పాల్గొన్నారు. ఇదే వేదికపై అధ్యాపకురాలుగా అంకితభావం , నిబద్ధతతో వృత్తిజీవితం గడుపుతున్న వట్టిప్రోలు అరుణకుమారిని 'ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్' అవార్డుతో ఘనంగా సత్కరించారు. జీవిత విలువలు, యువత సాధించాల్సిన విజయాలు, క్షణికావేశంలో యువత తీసుకునే నిర్ణయాలు, ఆత్మహత్యలు లేని సమాజాన్ని కాంక్షిస్తూ అతిథులు మాట్లాడారు. దుబాయ్ వైద్యులు డాక్టర్ దీప, డాక్టర్ మయం, తెలుగు సంఘా ల కోఆర్డినేటర్ త్రిమూర్తులు, ఏమిరేట్ తెలుగు సంఘాల అధ్యక్షుడు కిరణ్ కుమార్, దృత డెవలపర్స్ సీఈవో రత్నబాబు, స్పందన డైరెక్టర్ చంద్రిక రెడ్డి, అంజు రెడ్డి, ఈదా శామ్యూల్ రెడ్డి, కార్యవర్గం అరుణ కుమారిని అభినందించారు. అరుణకుమారి నరసరావుపేటలోని బీఎడ్ కాలేజీలో అధ్యాపకురాలుగా చేస్తున్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు



కళ్లం అంజిరెడ్డి పాఠశాలలో బహుమతుల ప్రదానం



పెనుమాక పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

తాడేపల్లిరూరల్: మెగా పేరెంట్స్ మీటింగ్ వల్ల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య అవగాహన పెరుగుతుందని, పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకాలు లభిస్తాయని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఉండవల్లి ప్రభుత్వ పాఠశాలకు ముఖ్య అతిథిగా తహసీల్దారు సీతారామయ్య విచ్చేశారు. మంత్రి నారా లోకేష్ తల్లిదండ్రుల మధ్య, ఉపాధ్యాయుల మధ్య ప్రేమ ఆప్యాయతలు పెంచాలనే ఉద్దేశంతో ఈ పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవోలు శాంతకుమారి, నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని శాంతిపేట ఎంపీపీ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కుర్చీలాట, ముగ్గుల పోటీ, తాడులాగే ఆటలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, హెచ్ఎం సీహెచ్ మల్లేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ వి.విజయకుమార్, ఉపాధ్యాయులు అబ్దుల్ రజాక్, మల్లేశ్వరి , జ్యోతి, సచివాలయ పాల్గొన్నారు. స్థానిక సెయింట్ పాల్స్ పాఠశాల సమావేశానికి మండల ప్రత్యేకాధికారి వి. కరహజరయ్యారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, హెచ్ఎం శౌరయ్య పాల్గొన్నారు. నుదురుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల సమావేశంలో ఎంఈవోలు షేక్. మహబూబ్ సుబాని, రవికాంత్ పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ జి.మల్లేశ్వరి, గుర్రాలశివయ్య, నాగభూషణం, నాగరాజు, బ్రహ్మారెడ్డి, పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కనుసన్నల్లో సమావేశం

తాడికొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్న పేరెంట్స్ కమిటీ సమావేశాలు టీడీపీ నాయకుల కనుసన్నల్లో నామమాత్రంగా కొనసాగాయి. సమావేశాల్లో వేదికలపై టీడీపీ నాయకులు చేరి ప్రభుత్వాన్ని, విద్యాశాఖా మంత్రి లోకేష్ బాబును పొగడ్తల వర్షం కురిపించడమే తప్ప స్థానికంగా ఏ సమస్యలు ఉన్నాయి అని ఎక్కడా ప్రస్తావించలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎక్కడా స్థానం కల్పించిన దాఖలాలు లేవు కానీ ఎలాంటి ప్రజా ప్రతినిధి కాని వ్యక్తులు మాత్రం వేదికలపై కుర్చీలు వేసుకొని ఎక్కి మరీ డబ్బాలు కొట్టుకోవడం వింతగా మారింది. తాడికొండ మండలం రావెల గ్రామంలో టీడీపీ నాయకులు వేదికపై బారులు తీరి మైకులు పట్టుకొని హోరెత్తించారు, కానీ హెచ్ఎం గౌరవ సూచికంగా వారు ప్రసంగిస్తున్న సమయంలో నిల్చొని కనిపించారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ



పోటీలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వి.శంకర్



రావెల పాఠశాలలో టీడీపీ నాయకులు వేదికపై ప్రసంగిస్తుండగా నిలబడిన హెచ్ఎం

చివరి హెచ్చరిక

మంగళగిరి నగర పరిధిలో ఆవులను వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి తాడేపల్లి నగర కమిషనర్ ఆలీం బాషా శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. యజమానులు వెంటనే తమ ఆవులను సంరక్షించుకోవాలని, రోడ్లపై వదిలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆవుల రోడ్లపై వదలడం వల్ల నగర పరిశుభ్రతకు ఆటంకం కలగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఆవులు రోడ్లపై కనిపిస్తే వాటిని శ్రీశైలం అడవులకు తరలించి, యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. శనివారం చినకాకాని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలోకి ఆకతాయిలు ప్రవేశించి, అల్లరి చేస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రేడ్ల కోసం విద్యార్థులపై ఒత్తిడి తగదు

మెగా పీటీఎంలో తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



తల్లిదండ్రుల అభిప్రాయాలను వింటున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: పరీక్షల్లో గ్రేడ్ల కోసం విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తేవొద్దని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ సూచించారు. పదోతరగతి వరకు తల్లిదండ్రులే పిల్లలకు రోల్‌మోడల్స్‌గా చెబుతూ, ప్రతిరోజూ కొంతసమయం స్నేహపూర్వకంగా గడపాలని, వారి ఆసక్తులను గమనించి తగినవిధంగా ప్రోత్సహించాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం) శనివారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల హైస్కూలులో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల చదువుకు ప్రాధాన్యతనిచ్చేలా చూడాలనీ, పుస్తక పఠనంతో కూడా మానసిక వికాసం, జ్ఞానం అలవడతాయని చెప్పారు. పుస్తక పఠనం సామర్థ్యం లేని విద్యార్థులు పోటీపరీక్షలను ఎదుర్కోలేరని అన్నారు. మేథ్స్, ఇంగ్లిష్‌పై దృష్టి పెట్టాలనీ, పెద్దలు ఇంట్లోనూ ఇంగ్లిష్‌లో మాట్లాడటం మంచిదని సూచించారు. విద్యార్థుల మధ్య పోటీతత్వం, స్నేహభావం ఉండాలన్నారు, రోజూ ఇంటికొచ్చాక తరగతి పాఠాలను పునశ్చరణ చేసుకోవటం మంచిదన్నారు. శారీరక వ్యాయామం కూడా ఉండేలా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ విలువల ఆధారిత విద్య కావాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో విద్యాబోధనలో మార్పులను గమనించాలని చెప్పారు. పిల్లలను వారి అభిరుచుల మేరకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని శాఖమూరి రాజ్యలక్ష్మి, దాతలు మొవ్వా సత్యనారాయణ, వెంకట కమలకుమారి, డాక్టర్ పావనీ ప్రియాంక, విశ్రాంత ఉపాధ్యాయిని మంజులవాణి, విద్యాకమిటి చైర్మన్ మానేపల్లి లక్ష్మీశైలజ, ఎంఈవో-2 జయంత్‌బాబు మాట్లాడారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: యువలి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరుకు చెందిన 24 ఏళ్ల యువతి తెనాలిలోని కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కు రోజు వస్తుంది. ఈ నెల 5వ తేదీన ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన ఆమె కనబడకుండపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించారు. లాభం లేకపోవడంతో టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా శనివారం కేసు నమోదైంది.

దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయం?

తెనాలిరూరల్: తెనాలిలో మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం అధికారులు పట్టుకున్నారన్న ప్రచారం శనివారం రాత్రి జోరుగా సాగింది. ఓ మద్యం దుకాణాన్ని నిర్ణీత సమయం లోగానే మూసి వేయడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. తెనాలి మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి నయనతార ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సుల్తానాబాద్‌లో లాజ్ విక్రయాలు, స్టేషన్ వద్ద నీళ్లు కలిపినట్టు ఉన్న మద్యాన్ని అధికారుల బృందం గుర్తించిందన్న ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు మాత్రం వివరాలు తెలిపేందుకు విముఖత వ్యక్తం చేశారు. మద్యం పలుచగా ఉందన్న విషయం తెలిసింది మినహా తమకు ఎటువంటి ఫిర్యాదు/సమాచారం లేదని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తెలిపారు.